మో'డల్' బస్టాపులు!

- ఏడాది కాక ముందే దెబ్బతిన్న స్టాపులు
- నాణ్యతకు తిలోదకాలిచ్చారని ఆరోపణలు


సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద ఉన్న బస్టాప్


రేకులు ఊడిన బుచ్చిరాజుపాలెం బస్టాప్

గోపాలపట్నం: ఆ కూడలి నగరానికే తలమానికం . అలాంటి కూడలిలో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన బస్టాపులు ఏడాది కాక ముందే శిథిలావస్థకు చేరాయి. దీంతో పనుల్లో నాణ్యతపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇవేమి మోడల్ బస్టాప్‌లు అంటూ ప్రయాణికులు నిట్టూరుస్తున్నారు.


సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద బస్టాప్ లోపల విరిగిన షీట్లు

ఇదీ పరిస్థితి

రద్దీని నియంత్రించేందుకు ఎన్ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా బ్రిడ్జి నాలుగు వైపులకు గాను మూడు వైపులా మోడల్ బస్ స్టాప్‌లు నిర్మించారు. అయితే అవి ఏడాది కాక ముందే చాలా మేరకు శిథిలావస్థకు చేరాయి. స్టాపుల్లో ప్లేట్లు విరిగి పోవడంతో వీటి నిర్మాణంలో డొల్లతనం బయటపడుతోంది. బస్‌స్టాప్‌లపై వేసిన షీట్ కూడా వర్షం వస్తే కారిపోతోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇవి పూర్తిగా నాణ్యమైనవి కావని చెబుతున్నారు. ప్రజల ఇబ్బందులు పట్టించుకోకుండా వీఎంఆర్‌డీఏ అధికారులు వారికి నచ్చినట్లు చేస్తున్నారని దుయ్యబడుతున్నారు.

దిగువన కూడా అదే తీరు

ఇక బ్రిడ్జి దిగువ మార్గంలో భారీ వాహనాలకు అనుమతి లేదు. అయితే వాహనదారులకు అవగాహన కలిగేలా బోర్డులు ఏర్పాటు చేయలేదు. హైట్ బారియర్స్ కూడా లేవు. దీంతో తరచూ భారీ వాహనాలు దిగువ రోడ్డులోకి వచ్చి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయమై స్వయంగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ వీఎంఆర్‌డీఏ అధికారులకు తెలియజేసినా ఇంతవరకు నిర్మాణం చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్ స్టాపుల మరమ్మతులతో పాటు హైట్ బారియర్స్ నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.


ఎన్ఏడీ బస్టాప్ దుస్థితి

పాపం అభాగ్యులు


దేవాలయం వద్ద భిక్షాటన చేసుకుంటున్న వృద్ధురాలు

మల్కాపురం: ఆరుపదుల వయసు దాటిన వారు అభాగ్యులుగా మిగిలారు. కన్నవారికి భారమై ఇళ్లు విడిచి వచ్చారో.. లేక కన్నవారే వదిలించుకున్నారో తెలియదు కాని దుర్భర స్థితి ఎదుర్కొంటున్నారు. వయసు మళ్లిన ఆ వృద్ధులు కటిక చీకట్లో.. రోడ్లుపై,మందిరాల గట్లపై ఎండకు ఎండి పోతున్నారు. వారి స్థితిని చూసిన వారు చలించి అన్నపానీయాలు అందించారు.

ఇదీ పరిస్థితి

పారిశ్రామిక ప్రాంతంలోని సాగరదుర్గా బీచ్ ఆలయానికి వెళ్లే మార్గంలో టీపీఎఫ్ సైట్‌కు సమీపంలోని పొదల్లో 60 ఏళ్లు దాటిన వృద్ధురాలు సోమవారం రాత్రి 11 గంటల సమయంలో రోధిస్తూ ఉంది. ఆ సమయంలో అటువైపు విధులకు వెళ్లే వారికి ఏడుపు వినపడినా మనిషి కనిపించకపోవడంతో వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం ఆ మార్గంలో వాకింగ్ చేస్తున్న నేవల్ ఆఫీసర్‌కు వృద్ధురాలి రోదన వినిపించడంతో ఆయన హృదయం చలించింది. వెంటనే ఆమె వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశాడు. ఆమె ఎలాంటి సమాచారం ఇవ్వక పోవడంతో మల్కాపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు.


సాగర్‌దుర్గ బీచ్‌కు వెళ్లే తుప్పల్లో రోదిస్తున్న వృద్ధురాలు

ఆలయం వద్ద మరో వృద్ధురాలు

స్థానిక ఆలయం వద్ద 65 ఏళ్లు పైబడిన వృద్ధురాలు భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. బిడ్డల ఆదరణ లేదని,చివరి రోజులు ఇలా దేవుడు ముందు కాలం గడుపుతున్నానని కన్నీరు పెట్టుకుని బదులు ఇస్తుంది.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత


బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా నగదు అందిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ఆర్ఆర్ వెంకటాపురంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కొమ్మోజు శ్రీను కుటుంబానికి వైఎస్సార్‌బీమా మంజూరైంది. దీంతో తక్షణ సాయంగా రూ.10వేల నగదును జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అందించారు. మిగిలిన రూ.90వేలు నగదు ఖాతాలోజమవుతుందని తెలిపారు. బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో 91, 92వ వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు గొంతిన జగదీష్, సచివాలయ కార్యదర్శి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి


ధర్నాలో నినాదాలు చేస్తున్న ఏపీ జేఏసీ (అమరావతి) నాయకులు

మహారాణిపేట: కాంట్రాక్ట్ ఉద్యోగులు గత 20 సంత్సరాలుగా రెగ్యులర్ కాకుండా ఉన్నారని ఏపీ ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం సంఘాల కార్యాచరణ సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలోని ఎన్‌జీవో హోంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, కార్యదర్శి రవిశంకర్, సిటీ కార్యదర్శి సత్యనారాయణ, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ త్రినాథరావు, అమరావతి కో చైర్మన్లు ఎ. శ్రీనివాసరావు, నమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి మహేష్, కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘం నాయకుడు వి. వీరబ్రహ్మం, కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నిద్దాం

కూర్మన్నపాలెం: కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ అన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా బుధవారం సాయంత్రం 4 గంటలకు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఎం ప్రచార భేరీలో భాగంగా కూర్మన్నపాలెం ఆర్చి వద్ద మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అయోధ్యరామ్ మాట్లాడుతూ 2021 జనవరి 27వ తేదీన కేంద్రప్రభుత్వం ప్రకటించిన 100 శాతం వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా, 800 రోజులుగా రిలే నిరాహార దీక్షలతో ప్రతిఘటిస్తున్నా పట్టించుకోకుండా, స్టీల్ ప్లాంట్ అమ్మకానికే కేంద్ర ప్రభుత్వం మొగ్గుచూప డం అన్యాయమన్నారు. నిర్వాసితులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ బుధవారం జరిగే భారీ బహిరంగ సభలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ప్రసంగిస్తారని తెలిపారు. ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాల పార్టీలు చేపట్టిన ప్రజా ఉద్యమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు జె.రామకృష్ణ, సీఐటీయూ నాయకుడు వి.ప్రసాద్, సీపీఐ నాయకులు తాండ్ర కనక రాజు, వి.ప్రసాద్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా కుంచమాంబ జాతర

కంచరపాలెం: మర్రిపాలెం ప్రజల ఆరాధ్య దేవత, కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన కుంచమాంబ అమ్మవారి జాతరను గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజల అనంతరం దర్శనాలు ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శర్మ ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అట్టహాసంగా తిరువీధి

సాయంత్రం అమ్మవారి ప్రతిమలతో గౌరీ సేవా సంఘం వద్ద గల మూలవిరాట్ నుంచి తిరువీధి మహోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. సుమారు 25 ఘటాలను ఆలయానికి చేర్చారు. కోలాటాలు, తప్పెటగుళ్లు, చిడతలు, వివిధ నేలవేషాలు, నడుమ అమ్మవారిని ఊరేగించారు. రాత్రికి అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఐదో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


కుంచమాంబను దర్శించుకుంటున్న గ్రామ కమిటీ సభ్యులు

డ్రా ప్రకారమే స్టాళ్ల కేటాయింపు

ఆరిలోవ: రైతుబజార్లలో ప్రతి వారం తీస్తున్న డ్రాలో వచ్చిన నంబర్ల ప్రకారమే రైతులు, డ్వాక్రా మహిళలు స్టాళ్లు నిర్వహించాలని మార్కెటింగ్ శాఖ ఏడీ షేక్ యాసిన్ తెలిపారు. ఎంవీపీ రైతుబజార్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఇక్కడ స్టాళ్లను పరిశీలించారు. తమకు కేటాయించిన నంబరు గల స్టాళ్లలో వారే ఉన్నారా? వేరెవరైనా ఉన్నారా? అన్న దానిపై ఆయన ఆరా తీశారు. అనంతరం ఆయన డ్రా తీసి, స్టాళ్ల కేటాయింపులు చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ప్రతి వారం నిర్వహించే డ్రా ప్రకారమే స్టాళ్లు నిర్వహించాలన్నారు. ఒకరికి కేటాయించిన స్టాళ్లలో వేరొకరు వ్యాపారం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏడీ దృష్టికి వినియోగదారులు పలు సమస్యలు తీసుకెళ్లారు. సీసీ కెమెరాలు పని చేయడం లేదని, విద్యుత్ దీపాలు వెలగడం లేదని చెప్పారు. లో రైతుబజార్ ఈవో జి.ప్రసాద్, సిబ్బంది కనకరాజు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ప్రజల్లో విశేష ఆదరణ

వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆనంద్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని ఏపీ సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. ప్రజల ఆదరణ చూస్తుంటే మరలా జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి లభించిన ఆదరణను తెలియజేసేందుకు జీవీఎంసీ 58వ వార్డులోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వార్డుల్లో ఈ నెల రెండో వారం నుంచి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఆయా ప్రాంతాల గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లతో కలిసి చేపట్టామన్నారు. సుమారు 60 వేల మందికి పైగా స్పందించి, మిస్డ్ కాల్స్ చేశారన్నారు. ప్రజల్లో జగన్‌కు ఆదరణ తగ్గిందని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, జనం మాత్రం సీఎం జగన్ వెంటే నిలవడం ఆనందంగా ఉందన్నారు.

నియోజకవర్గంలో సుమారు 5 వేల మంది గృహసారథులు సైన్యం వలే శ్రమిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీని నమ్ముకుని పని చేస్తున్న ప్రతి ఒక్కరికీ తప్పక గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, పలు వార్డుల కార్పొరేటర్లు పి.వి.సురేష్, బల్లా లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, 59వ వార్డు పార్టీ అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్, భీశెట్టి గణేష్, పిల్లా కన్నబాబు, దాడి సత్యనారాయణ, తోనంగి వెంకటరమణ, చుక్క వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకూ లబ్ధి

మల్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకూ లబ్ధి చేకూరుతోందని విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 60వ వార్డు బర్మాకాలనీ సచివాలయం పరిధి నివాసాల వద్ద మంగళవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. నవరత్నాల ద్వారా ఎంత మంది లబ్ధి పొందుతున్నారో తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు మాదిరి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలను మాయ చేయడం రాదన్నారు. నమ్ముకున్న ప్రజలను మోసం చేయాలనే ఆలోచన ఉంటే ఇంత ధైర్యంగా జగన్ ప్రజల ముందుకు రాగలరా అన్నారు. చంద్రబాబుకు ధైర్యం ఉంటే రాష్ట్రంలో ఏ ఇంటి గడపకైనా వెళ్లి తన పాలనలో ఏం మేలు చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. చంద్రబాబుకు ధైర్యం లేదు కాబట్టే పొత్తుల కోసం పాకులాడుతున్నాడన్నారు. పచ్చ పత్రికల ద్వారా జగన్‌పై విషం చిమ్ముతున్నారన్నారు. సీఎం జగన్ ప్రజలను నమ్ముకున్నారు కాబట్టే ధైర్యంగా వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు పి.వి.సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, అంగ రామ్‌ప్రసాద్, స్వర్ణలత పాల్గొన్నారు.


లబ్ధిదారుకు సంక్షేమ పథకాల మంజూరు పత్రం అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, పీవీ సురేష్

కొనసాగుతున్న 'మా నమ్మకం నువ్వే జగన్'

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం కొనసాగుతోంది. వార్డులోని ఇంటింటికీ తిరుగుతూ గత ప్రభుత్వం కంటే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఏ విధంగా మెరుగైన పాలన అందిస్తో వివరించారు. ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఇంటి గోడపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికిస్తూ ప్రభుత్వ సుపరిపాలనపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, అనుదీప్, నక్కా సూర్యనారాయణ, మసేనమ్మ, భారతి, సచివాలయ కన్వీనర్, గృహ సారథులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

మృతుని భార్యకు రూ.15 లక్షలు అందజేత

అక్కిరెడ్డిపాలెం: విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన వ్యక్తి కుటుంబానికి కంపెనీ నష్టపరిహారం అందజేసింది. వివరాలివి.. 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీకి చెందిన బొడ్డేటి రవికుమార్ సింధియా ప్రాంతంలోని ఓ కంపెనీలో కార్మికుడిగా పని చేసేవాడు. కొద్ది రోజుల క్రితం విధి నిర్వహణలో ఉండగా ప్రమాదవశాత్తు మరణించారు. అతని కుటుంబానికి న్యాయం చేసే విధంగా కార్పొరేటర్లు గుడివాడ అనూష, పి.వి.సురేష్, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ కంపెనీ యాజమాన్యంతో సంప్రదింపులు చేపట్టారు. దీనిపై స్పందించిన కంపెనీ యాజమాన్యం మృతుని కుటుంబానికి రూ.15 లక్షలు నష్టపరిహారాన్ని అందించింది. ఆ చెక్కును మృతుని భార్యకు వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడివాడ లతీష్ మంగళవారం అందజేశారు. నాయకులు ఈటి శ్యామలరావు, గుడివాడ సంక్షేమ సేవా సంఘం పెద్దలు పాల్గొన్నారు.


మృతుని భార్యకు చెక్కు అందిస్తున్న లతీష్

మలేరియాను నిర్మూలిద్దాం


బుచ్చిరాజుపాలెం ఎస్సీ కాలనీ వద్ద ర్యాలీలో కార్పొరేటర్ రమణ, వైద్యులు

గోపాలపట్నం: అవగాహనతో మలేరియా నిర్మూలన సాధ్యమని 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం బుచ్చిరాజుపాలెం అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అంటు వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు దీపిక, వికాస్, జాకీర్ హుస్సేన్, హెల్త్ సెక్రటరీలు నాగలక్ష్మి, షేక్ జమీలా, శివలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బాలికల ఐటీఐలో..

కంచరపాలెం: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (బాలికల ఐటీఐ)లో వరల్డ్ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మలేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కోశాధికారి డాక్టర్ ఎంవీవీ మురళీమోహన్ పాల్గొని మాట్లాడారు. మలేరియా నిర్మూలనకు తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముందుగా విద్యార్థులకు మలేరియాపై వ్యాసరచన పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏడీ ప్రసాద్, ఐటీఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ మురళీమోహన్

40వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, బయాలజిస్ట్ చక్రవర్తి పాల్గొని మలేరియా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఏటా ఏప్రిల్ 25వ తేదీన ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 106 దేశాల్లో 3.3 బిలియన్ మంది ప్రజలు మలేరియా బారిన పడుతున్నారని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చునని, ప్రజలందరు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉంచకుండా, ప్రతి మంగళ, శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో మల్కాపురం మలేరియా నివారణ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్, సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సెక్రటరీలు, జీవీఎంసీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ సందర్శించిన సీపీ

ఉక్కునగరం: నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ మంగళవారం స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఏడీసీపీ గంగాధర్, సౌత్ డీసీపీ ఆనందరెడ్డి, ఏసీపీ టి. త్రినాథరావుతో వచ్చి ఆయన స్టేషన్ పరిసరాలను సందర్శించారు. అక్కడున్న చోరీ సొత్తు గురించి ఆరా తీసిన ఆయన, సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టేషన్‌లో సిబ్బంది సంఖ్య, వారి సంక్షేమం గురించి అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద బుధవారం నిర్వహించనున్న బహిరంగ సభ స్థలాన్ని ఆయన సందర్శించారు.

వామపక్షాల సభ విజయవంతానికి పిలుపు

సింధియా: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న బుధవారం సాయంత్రం 4 గంటలకు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు సీపీఐ, సీపీఎం ప్రచార భేరీలో భాగంగా జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గడిచిన 800 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా పట్టించుకోకుండా కర్మాగారం అమ్మకానికే కేంద్ర ప్రభుత్వం మొగ్గుచూపడం అన్యాయమన్నారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి భూములిచ్చిన నిర్వాసితులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, నేటికీ సుమారు 5 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా నిర్వాసితులను తీసుకోవడం లేదన్నారు. బహిరంగ సభకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, భాస్కరరావు, గోపాల్, సురేష్, ఆదినారాయణ, లక్ష్మణరావు, సత్యనారాయణ, లోకేష్, బాల, ఈశ్వరరావు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న జగ్గునాయుడు